

# పెళ్ళిసందడి

-మల్లాది రవిశంకర్

హ్యూమన్ రిలేషన్స్...మానవ సంబంధాలు... పెంచుకుంటే..పది లంగా అల్లుకుపోతాయ్. మరి, తెంచుకుంటే నామరూపాలు లేకుండా పోతాయ్. ఈ తేడాలూ...మనస్పర్థలూ ఈనాటివా?

కాదు. పాతిక సంవత్సరాలుగా ఎదిగి, వటవృక్షంలాగా విస్తరించిన మేరువులు. నేను అన్నలచాటు ముద్దుల చెల్లిని. నాన్న, అమ్మ, అన్నల మధ్య అంతా ముద్దుగానే పెరిగాను పెళ్ళయ్యేదాకా.

ఇక మావారు...సమిష్టి కుటుంబంలో పెద్ద కొడుకు..బంధాలూ, బాధ్యతలూ... వాళ్ళ నాన్న చిన్నతనంలోనే పోవటంతో, ఎన్నో కష్టాలని ఓర్చి చెల్లెళ్ళ పెళ్ళి, తమ్ముళ్ళ చదువులూ చూసుకుంటూ, అంచెలంచెలుగా ఎదిగారాయన. ఆయన తర్వాతి తమ్ముడు ఉద్యోగం సంపాదించి సంసారభారాన్ని అందుకోగానే, ఆయన పెళ్ళి చేసుకోవాలనుకున్నారు.

ముక్కలు కాకుండా, కుటుంబాన్ని ఒకదరికి చేర్చిన ఈయనంటే, వాళ్ళ బంధువర్గంలోనే చాలా మక్కువ. అందగాడయిన ఈయన పెళ్ళికి అందరూ బాగా ఎదురు చూశారనే చెప్పాలి.

వీళ్ళంతా ప్రేమలూ, దోమలూ అంటూ ఒకళ్ళనొకళ్ళు రాసుకుపూసుకు ఉంటారు. ఇక మా పుట్టింటివారు ఇలాంటి సెంటిమెంట్‌లకు అంత విలువివ్వరు. ఎవరికి వారు ఇండిపెండెంట్.

నన్ను చూడటానికి, పెళ్ళి చూపులకి ఆయనొక్కరే వచ్చారు.

నన్ను చూడగానే ఆయనకి నేను నచ్చటం, తన ఇంట్లో ఎవ్వరూ తన మాటని కాదనరనటం, అలా అని నేను నచ్చానని అక్కడే చెప్పి, పెళ్ళి ఏర్పాట్లు చేసుకోమనటం అంతా జరిగిపోయింది.

ఆయన అక్కలూ, బిలబిలమనే చెల్లెళ్ళూ, తమ్ముళ్ళూ...అందరూ నన్ను ఎంగేజ్‌మెంట్ అంటే తాంబూలం రోజునే చూడటం.

అందుకు ముఖ్యకారణం వాళ్ళు ఎక్కడో దివిసీమలో ఒక పల్లెటూర్లో ఉండేవాళ్ళు. మేము హైదరాబాద్ వాస్తవ్యులం. పాతికేళ్ళక్రితం ఆ పల్లె నుండీ ఈ నగరానికి రావటం పెద్ద విశేషం.

నన్ను చూసి నా ఆడపడుచులందరూ పెదవి విరిచారు.

అంతోసి వాళ్ళ కారిపోయే అందాలకి నేను తీసిపోయేట్టున్నానట. నల్లటి నేను, పచ్చటి వాళ్ళ తమ్ముడి ముందు కాకి ముక్కుకు దొండపండు లాగా ఉన్నానట. నాముందే నన్ను విమర్శించారు. దాంతో ముందునుండీ వాళ్ళంటే నాకొక నెగిటివ్ ఫీలింగ్ ఏర్పడింది. అదికాలంతోపాటు అగాధంగా మారింది.

ఈ పాతికేళ్ళ కాలంలో మధ్య మధ్యలో పెళ్ళిళ్ళకీ, సందళ్ళకీ, మంచికీ చెడుకీ వాళ్ళూ నేనూ ఎప్పుడన్నా కలిసినా, ఆ గ్యాప్ అలాగే కంటిన్యూ అవుతూ వచ్చింది.

నాకు వాళ్ళూ, వాళ్ళ పద్ధతులూ నచ్చేవి కావు. వాళ్ళకి నేనూ, నా మాటలూ, నా చేతలూ అంతకంటే నచ్చేవి కాదు.

ఇంతకాలం...వాళ్ళకి వాళ్ళూ, నాకు నేనూ...ఏనాడూ ఆత్మ పరిశీలన చేసుకుని రిలేషన్స్ రీ-బిల్ట్ చేసుకోవడానికి ప్రయత్నించలేదు.

★ ★ ★

మా పెద్దబ్బాయ్ పెళ్ళి కుదిరింది. ఇది మా ఇంట్లో జరగబోయే మొదటి శుభకార్యం అని ఒక వంక ఆనందంగా ఉన్నా, మరోవంక చెప్పలేని గుబులు.

పెళ్ళి కూతురుది హైద్రాబాద్. మేము ఢిల్లీలో స్థిరపడ్డాం. మా పెద్దబ్బాయ్ ఉద్యోగ రీత్యా పుణెలో ఉన్నాడు.

పెళ్ళి హైద్రాబాద్‌లోనే అని నిర్ణయించారు. పెళ్ళయిన మూడు రోజుల్లోనే శూన్యమాసమో...కత్తరో...ఏదో వస్తుందట.

దాంతో గృహప్రవేశం, సత్యనారాయణ వ్రతం, మూడు నిద్దర్లూ అన్నీ మా మరిది ఇంట్లోనే చెయ్యక తప్పలేదు.

ఈ పెళ్ళి సంబంధం కుదరటం ఒక పెద్ద యజ్ఞమనే చెప్పాలి.

ఎందుకంటే...మేము ఉండేది ఢిల్లీలో..మావాడు పుణెలో..ఆంధ్రా పెళ్ళికూతుళ్ళు దొరికేది హైద్రాబాద్, ఆ చుట్టుపక్కలా...

మొదటి మొదట్లో పెళ్ళి చూపులకి ముచ్చట పడి ఢిల్లీనుండి పడొచ్చేదాన్ని. కానీ మా వాడికి ఒక్క పిల్ల కూడా తొందరగా నచ్చేదికాదు.

ఇక ఇలా కాదని, వాడే వారం వారం పుణె నుండి హైద్రాబాద్ వాళ్ళ బాబాయి దగ్గరకొచ్చేవాడు. బాబాయినీ, అత్తనీ, మేనత్తల్నీ తీసుకొని పెళ్ళిచూపులకి వెళ్ళేవాడు.

పెళ్ళి చూపులకెళ్ళొచ్చి పెళ్ళికూతురి అందచందాల గురించికంటే, అత్తగురించీ, మేనత్తల మంచితనం గురించీ వాడు పొగుడుతుంటే...నాకు పుండుమీద కారం పూసినట్టుండేది.

అవునుమరి...ఏ గూటి పక్షులు ఆ గూటి పలుకులే పలుకుతాయ్.

చివరికి అనుకున్నట్టుగానే వాళ్ల మేనత్త చూసిన పిల్లే వాడికి నచ్చింది. వాడి పెళ్ళికోసం తెగ ఎదురుచూసిన నాకు, వాడి నోటినుండి పిల్ల నచ్చిందనే కబురు చాలా సంతోషాన్ని కలిగించింది. దాంతో పిల్లని చూడకపోయినా, వాడికి నచ్చింది అదే పదివేలని తథాస్తు అనేశాం.

పెళ్ళి కూతుర్ని నేనూ, ఆయనా ఎంగేజ్‌మెంట్ రోజునే చూశాం.

పిల్లకేం కుందనపు బొమ్మలాగా ఉంది. ఇంజనీరింగ్ చదువుకుంది.

అంతవరకూ బానే వుంది.

కాకపోతే...పెళ్ళి హైద్రాబాద్‌లో. వ్రతం, మూడు నిద్రలూ అన్నీ మా మరిది ఇంట్లో. మేనత్తలూ, బాబాయిల ఆధ్వర్యంలో. అదే విసుగ్గా ఉంది.

పెళ్ళి కుదిరిన దగ్గర్నుండీ ఈయన ఎక్కడా ఆగటం లేదు.

వాళ్ళ అక్కలకి ఫోన్లు చెయ్యడం, చెల్లెళ్ళకీ, తమ్ముళ్ళకీ ఫోన్లు చెయ్యడం...పెళ్ళి మీరే జరిపించాలంటూ..

అమెరికాలో ఉద్యోగం చేస్తున్న మా చిన్నబ్బాయి పెళ్ళికి రెండు రోజుల ముందుగా ఇండియా రావటంతో, ఆ నెపంతో పెళ్ళికి రెండు రోజుల ముందే హైద్రాబాద్ చేరేటట్టు ప్లాన్ చేసుకున్నాం.

అయినా ఏదో గుబులూ, కొండంత భారం.

పెళ్ళంటే బిలబిలమంటూ ఆడపడుచులూ, మరుదులూ అంతా చేరతారు.

అంతా వాళ్ళ ఆధ్వర్యంలోనే. మంచాన ఉన్న ముసలి అత్తగారు కూడా ఆ మరిది దగ్గరే ఉంటుంది.

పెళ్ళి మా అబ్బాయిదయినా అంతా వాళ్ళ హయామే అని మనసు బాధ పడుతోంది.



ఎవరన్నా ఏమన్నా అంటే ఒళ్లో తల పెట్టుకుని కడుపునిండా బాధ తీర్చుకోవటానికి సుందరిగారనే మా ఫ్యామిలీ ఫ్రెండుని వెంట తెచ్చుకు న్నాను.

* * *

ఎప్పుడు హైద్రాబాద్ వచ్చినా నాలుగు గంటలు లేట్‌గా వచ్చే రైలు ఆ రోజు కరెక్ట్ టైంకే చేరుకుంది.

రైలు దిగాక ఒక టాటా సుమో మాట్లాడుకొని మా మరిది ఇంటికి బయ ల్దేరాం.

కారు ముందుకు వెడుతుంటే నా గుండెలో ఏదో గుబులు. కారు సందు మొదటికి వచ్చేసరికి సన్నగా తలనొప్పి కూడా మొదలయింది.

కారు మా మరిది ఇంటిముందు ఆగింది. వాకిలి ముందు తాటాకుల పందిరి వేయించారు.



## నేహా కోరిక!

తన సినీ కెరీర్ ప్రస్తుతం సంతృప్తికరంగా వుందని భావిస్తున్న నేహా ధుపియాకి ఓ కోరిక వుందిట. అదేంటంటే- షారుఖ్ ఖాన్‌కి జంటగా నటిం చాలనిట. అది ఎలాంటి పాత్రయినా కానీ, షారుఖ్‌తో ఒక్క చిత్రంలో అయినా కలిసి నటించాలని వుందని తెగ ఇదైపోతోంది నేహా. మరి ఆమె కోరిక తీర్చే నిర్మాత ఎక్కడున్నాడో? ఎప్పుడొస్తాడో?




పచ్చి తాటాకుల వాసనా, ఇంటికి కొత్తగా వేయించిన రంగుల వాసనా సన్నగా వీధిలోకి వస్తోంది.

గుమ్మాలకి అందంగా డిజైన్లూ, వాకిలి ముందు తెల్లగా పొందికగా ముగ్గులూ, డాబాకి రంగు రంగుల లైట్లూ...

ఇల్లంతా పెళ్ళికళ కొట్టొచ్చినట్టుగా కనిపిస్తోంది.

కార్లోంచి పూర్తిగా కిందకి దిగకుండానే నిండుగా నవ్వుతూ ఎదురొ చ్చింది మా పెద్దాడపడుచు.

డాబామీద షామియానా వేయించారు. వాకిట్లోనూ, డాబామీదా నీట్‌గా వేసిన కుర్చీలు.

"రండర్రా పెళ్ళివారూ! మీకంటే మేమే ముందొచ్చాం" అంటూ అక్కున చేర్చుకుంది మా పెద్దాడపడుచు.

ఆమె ప్రవర్తనలో కొట్టొచ్చిన సహజత్వం!

మనసు ఎందుకో నిండుగా, హాయిగా అనిపించింది.

కాళ్ళు కడుక్కొని ఇంట్లోకొచ్చాం.

ఆయనా, మా ఇద్దరు పిల్లలూ ఎక్కడా ఆగటం లేదు. బాబాయిలతో, మేనత్తలతో కబుర్లేసుకున్నారు.

అప్పటికే వంట మనిషి వచ్చేసినట్టుంది కాఫీలు కలుపుతోంది.

"తొందరగా ముఖాలు కడుక్కోండి. ఎప్పుడనగా తిన్నారో...కాఫీ, టిఫిన్ చేద్దురుగాని" అని హడావిడి చేసింది మా ఆడపడుచు.

ఆమే మావారి అక్కగారే కాకుండా, ఈ మరిది అత్తగారు కూడా కావ టంతో ఇంట్లో చాలా స్వతంత్రంగా ఉంది.

మెకానికల్ లైఫ్‌కి అలవాటుపడ్డ నాకు, ఈ ప్రేమలూ, ఆప్యాయతలూ కొత్తగా కనిపించినా ఎందుకో హాయిగా అనిపించటం మొదలుపెట్టాయి.

ముఖం కడుక్కురాగానే కాఫీ, టిఫిన్లు పెట్టారు. చాలా రుచిగా ఉన్నాయ్ అన్నీ.

నా సపోర్ట్‌కోసం తెచ్చుకున్న మా ఫ్యామిలీ ఫ్రెండ్ అప్పటికే మా ఆడప డుచులతో కబుర్లలో పడింది.

"వీడికి మంచిపిల్ల కుదిరితే మా గ్రామదేవత నాంచారమ్మ తల్లికి చీరె పెట్టిస్తానని మొక్కుకున్నానమ్మా! ఆ తల్లి మొక్కు చెల్లించాలి" అంటోంది మా ఆడపడుచు.

గుండెలో ఏదో తడి. నావాళ్ళు కాదనుకున్న వాళ్లందరూ మాకోసం, ఈ ఇంటి పెళ్ళిలాగా ఎన్ని ఏర్పాట్లు.

మేనల్లుడికి మంచి పిల్లతో పెళ్ళి కావాలని మేనత్తల మొక్కులు....

ప్రేమలూ, బంధాలు అంటే ఇవేనా??? గుప్పెడంత గుండెకి సాగర మంత సంతోషం.

అందరం స్నానాలు ముగించాం. ఇంటికి చుట్టాలొస్తున్నారని, ఇల్లు ఇరుకు అవుతుందనీ రెండిళ్ల అవతల ఇంకో ఇంటిని మాకోసం ఏర్పాటు చేశాడు మా మరిది.

కానీ ఎవ్వరం అక్కడికి వెళ్ళలేదు.

మనసు గదులు తెరుచుకోవటం మొదలుపెడితే, ఇంకా ఇల్లు చిన్నద యినా ఇరుకు అనిపించదేమో!

పెళ్ళి బట్టలూ, నగలూ ముహూర్తందాకా బయటికి తియ్యొద్దనీ, వాటిని చూసి నా ఆడపడుచులు ఏడుస్తారని ముందునుండీ అనుకున్నాను.

దానికి భిన్నంగా బట్టలూ, నగలూ అన్నీ తీసి అందరికీ చూపించాను. అందరూ చాలా బాగున్నాయని నా సెలక్షన్ని పొగుడుతుంటే చాలా ఆనం దంగా అనిపించింది.

కబుర్ల మధ్యనే భోజనాల టైం అయింది. వంటావిడా, మా ఆడపడుచూ మడి కట్టుకొని అరిటాకుల్లో అందరికీ వడ్డన చేశారు.

ఐటమ్స్ అన్నీ శుచిగా, రుచిగా ఉన్నాయ్. నిజమైన నిండైన పెళ్ళివారింటి భోజనం చేస్తున్న ఫీలింగ్.

భోజనాలయ్యాక నడుం వాల్చినా ఏవో కబుర్లే కబుర్లు.

మా ఆడపడుచు బలవంతంమీద నాలుగింటికి టాక్సీ పిలిపించుకొని మా కజిన్స్, ఊళ్ళో కొందరి బంధువుల్నీ పిల్చి వచ్చాం. ఊళ్లోకొచ్చి వాళ్లకి కార్డిచ్చి పిలవకపోతే బాగుండదని ఆమె పదే పదే అనటంతో వెళ్ళక తప్పలేదు.

మళ్ళీ తిరిగొచ్చేటప్పటికి ఏడున్నర దాటింది.

పెళ్ళి హడావిడికి నెలరోజుల్నుండీ పుట్టెడు బి.పి., కుంచెడు షుగర్నీ, నెగ్లెక్ట్ చేశాననుకుంటా. దాంతో బాగా త్రోట్ ఇన్ఫెక్షన్ వచ్చింది.

"మర్నాటినుండీ ఇంత హడావిడి పెట్టుకొని ఎలా నెగ్లెక్ట్ చేశావ్ వదినా?'' అని మెత్తగా చివాట్లు పెట్టి అప్పటికప్పుడే మా మరిది స్పెషలిస్ట్ డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళి మంచి మందేయించాడు ఇమ్మీడియెట్ రిలీఫ్ కోసం.

మర్నాడు పొద్దుటే అయిదింటికే మా వాడిని పెళ్ళి కొడుకుని చేశాం.

పావు తక్కువ అయిదుకల్లా పెద్ద ముత్తయిదువులయిన మావారి నలుగురు పిన్నులూ, మా ఆడపడుచులూ అంతా కలిసి నన్నూ, మావారినీ, పెళ్ళికొడుకు మా పెద్దబ్బాయినీ, తోడి పెళ్ళికొడుకు మా చిన్నబ్బాయినీ కూర్చోబెట్టి హారతులిచ్చారు.

ఇంత పొద్దుటే వచ్చేశారు భజంత్రీలు.

వాతాపి గణపతిం....అని వాళ్ళు ఒకపక్క మంగళ వాయిద్యాలు మోగిస్తుంటే, మావారి పిన్నులూ, మా ఆడపడుచులూ, తోడికోడళ్ళు మా అందరి తలలకీ నూనెపెట్టి హారతిచ్చారు. మా అబ్బాయిని పెళ్ళి కొడుకుని చేసి, బుగ్గన చుక్కా, కళ్యాణం బొట్టు, కాళ్ళకి పారాణి పెట్టి అలంకరిస్తుంటే...ఆనందం పట్టలేక వెక్కి వెక్కి ఏడ్చేశాను. అవి ఆనందానికి పరాకాష్ఠ అయిన ఆనందభాష్పాలు అవటంతో సుందరిగారి ఒడి అవసరం రానేరాలేదు. ఆక్షణం అనిపించింది. నా మూర్ఖత్వంతో ఇలాంటి ఎన్నెన్ని ఆనందాలని మిస్ అయ్యానని.

ఇలాంటి ఎన్నెన్నో మధురస్మృతుల మధ్య కలలాగానే మా పెద్దబ్బాయ్ ఒక ఇంటివాడయిపోయాడు.

సత్యనారాయణ వ్రతం, మూడు నిద్రలూ...అన్నీ నిర్విఘ్నంగా జరిగిపోయాయి.

పెళ్ళికి తొంభై ఏళ్ళ మావారి బాబాయ్, పండు ముత్తయిదువ పిన్నీ విజయవాడ నుండి రావటం విశేషం. మా అత్తగారూ, ఆయనా ఒకే వయసువాళ్ళట. వాళ్ళ చిన్నప్పుడు కలిసి ఆడుకున్నారట. వదినగార్ని చూసి ఆయన కంటతడి పెడితే మా అందరికీ కూడా కన్నీళ్ళొచ్చాయి. ఇంతమంది పెద్దల ఆశీస్సులు మాకూ, మా పిల్లలకీ ఈ పెళ్ళి సందర్భంగా లభించాయి.

ఇంట్లో అందరు చుట్టాలు ఉండగానే, ముందుగా మేమే బయల్దేరి ఢిల్లీకి వెళ్ళిపోతుంటే మా మూర్ఖత్వానికి నాకే సిగ్గేసింది.

ఢిల్లీలో రిసెప్షన్ కొంపలు మునిగేట్టు అంత తొందరగా ఎందుకు ఏర్పాటు చేశాను అని ఇప్పుడు అనిపిస్తోంది.

సందడినీ, సంతోషాన్నీ వదిలి...గుండెనిండా సంతోషాన్ని నింపుకొని...వెళ్ళలేక వెళ్ళలేక కారెక్కేశాను.

కారు బయల్దేరి పెళ్ళిపందిట్లోంచి ముందుకి వెడుతుంటే...మనసులో ఏదో మిస్ అవుతున్న బాధ.

ఇప్పటి బాధకీ, పెళ్ళికి వచ్చేటప్పటి నా మనోస్థితికీ హస్తిమశకాంతరమంతటి తేడా.

"మావల్ల ఏదైనా తప్పులు జరిగితే ఏమీ అనుకోవద్దు వదినా!'' అని మా మరుదులూ, ఆడపడుచులూ అంటుంటే నా కళ్ళల్లో నీళ్లు తిరిగాయ్.

"జీవితకాలం ఆనందాన్నిచ్చింది ఈ పెళ్ళి'' అన్నాను కన్నీళ్ళ మధ్య.

"వదినగారూ! మళ్ళీ పది రోజుల్లో ఢిల్లీలో రిసెప్షన్ అయ్యాక మీ ఊరు వస్తాను. నాంచారమ్మ తల్లికి చీరెపెట్టి నాలుగు రోజులు మీ ఇంట్లో ఉంటాను'' అంటుండగానే కారు బయల్దేరింది.

హ్యూమన్ రిలేషన్స్...మానవ సంబంధాలు...

పెంచుకుంటే ఏపుగా అల్లుకుపోతాయ్...

మరి తెంచుకుంటే..

ఆనవాలు కూడా లేకుండా.... పగలూ, మనస్పర్థలూ, కోపాలూ, తాపాల్లానే మిగిలిపోతాయ్.

★



## రోబో కుక్

ఇకపై అర్థాంతరంగా పనిమానివేసే వంటవాళ్ళతో వేగనక్కర్లేదు. మా రోబో కుక్‌లతో వంట చేయించుకుని నిశ్చింతగా ఉండండి అంటున్నారు జపనీస్ శాస్త్రజ్ఞులు. అంత చిన్న దేశంలో వివిధ రకాల పనులు చేసి పెట్టటానికి 8 లక్షల ఇండస్ట్రియల్ రోబోలున్నాయిట. వాటితో 10 బిలియన్ డాలర్ల బిజినెస్ జరుగుతోందిట.

-తటవర్తి

